క్లుప్తంగా

కానిస్టేబుల్ మృతి


శంకర్ (ఫైల్)

భైంసా: బాసర ట్రిబుల్‌ఐటీలో పని చేస్తున్న నిజామాబాద్‌కు చెందిన దేశ్కర్ శంకర్(56) అనే హెడ్ కానిస్టేబుల్ అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. క్యాన్సర్‌తో బాధపడుతున్న శంకర్‌కు ఆదివారం రాత్రి కడుపునొప్పి తీవ్రం కావడంతో నిజామాబాద్ ఆసుపత్రిలో చేరాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ఈయన ఉమ్మడి జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించాడు. హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది బాసర ట్రిపుల్‌ఐటీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ నిజామాబాద్ వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున సహాయ, సహకారం అందిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఆనంద్‌రావుపటేల్

భైంసాటౌన్: పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓవైసీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సిందే ఆనంద్‌రావుపటేల్, మైనార్టీ సెల్ జిల్లా ఇన్‌చార్జి జునైద్ సమక్షంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జావిద్ ఖాన్, అబ్దుల్ బారి, మోహిత్‌తోపాటు 200 మంది పార్టీలో చేరినట్లు ఆనంద్‌రావు పటేల్ తెలిపారు. పట్టణాధ్యక్షులు భూమన్న, అహ్మద్, ప్రశాంత్, అంజాద్‌షేక్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నర్సాపూర్(జి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని నందన్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నందన్ గ్రామంలో జనార్దన్‌రెడ్డి అనే రైతుకు చెందిన గిర్‌జాతి ఆవు శివారులో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.లక్షా 10వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

హరితహారం


మొక్కలు నాటుతున్న కూలీలు

లక్ష్మణచాంద: హరితహారంలో భాగంగా సోమవారం మండలంలోని రాచాపూర్‌లో సరస్వతి కాల్వ సమీపంలో ఉపాధిహామీ కూలీలు మొక్కలు నాటారు. ఖాళీస్థలాలు, పాఠశాలలు, ఆలయాల వద్ద మొక్కలు నాటుతున్నట్లు ఎఫ్ఏ శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి అభ్యర్థనను స్వీకరించాలన్నారు. అలాగే 100 డయల్‌కు స్పందించి ఆపదలో ఉన్న వారిని రక్షించాలని సూచించారు. వాహన తనిఖీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'మున్నూరుకాపులకు క్షమాపణ చెప్పాలి'

దిలావర్‌పూర్: మున్నూరుకాపులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కె.శ్రీహరిరావు వెంటనే తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని.. తక్షణం క్షమాపణ చెప్పాలని ఆ సంఘం నాయకులు పాల్దె అనిల్, కొండ్ర రమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల సంఘ నాయకులు పాల్గొన్నారు. ధని రవి, నిమ్మల చిన్నయ్య, ఒడ్నం కృష్ణ, రాజేశ్వర్, నవీన్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో సోమవారం లోకడేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే ఇక అంతే..!


లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా వ్యవసాయ బావి

- రోడ్డు పక్కనున్న వ్యవసాయ బావులు, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు కరువు
- వాహనదారులకు పొంచి ఉన్న ముప్పు
- సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు


ధర్మారం-లక్ష్మణచాంద వెళ్లే దారిలో బావి

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న బావులు, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. రాత్రి వచ్చిపోయేటప్పుడు ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా మృత్యు ఒడిలోకి చేరే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగక ముందే ఆయా శాఖల అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బావులు..

- మండలంలోని ధర్మారం, పీచర గ్రామాల నుంచి లక్ష్మణచాందకు వెళ్లే మార్గంలో కోతి దేవుడి ఆలయ సమీపంలో రోడ్డుకు ఆనుకొని రెండు వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.
- మండలంలోని పీచర గ్రామం నుంచి న్యూబొప్పారం, న్యూవెల్మల్ గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న రెండు వ్యవసాయ బావులకు రక్షణ చర్యలు చేపట్టలేదు.
- లక్ష్మణచాంద నుంచి న్యూకంజర్ వెళ్లే మార్గంలో సరస్వతి కాలువపై బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కనే వ్యవసాయ బావి ఉంది.
- మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా వ్యవసాయ బావి ఉంది.


కంజర్ సమీపంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్


పీచర సమీపంలో రోడ్డు పక్కన బావి


బొప్పారం-పీచర మార్గంలో రోడ్డు పక్కన బావి


లక్ష్మణచాంద-న్యూకంజర్ దారిలో కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లు

చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు..

- లక్ష్మణచాంద నుంచి న్యూకంజర్ వెళ్లే మార్గంలో ఉన్న ఐదు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు.
- లక్ష్మణచాంద నుంచి ధర్మారం వెళ్లే మార్గంలో మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందేలా ఉంది.

బావులను పూడ్చివేయించాలి



లక్ష్మణచాంద నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంట వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు వాటిని పూడ్చివేసేలా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలి. – శివన్న,న్యూకంజర్

కంచెలు ఏర్పాటు చేయాలి



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గంలో రోడ్ల వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చేతికి అందేలా ఉన్నాయి. అధికారులు కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. –దశరథ్, లక్ష్మణచాంద

నిధులు రాగానే చర్యలు

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే రోడ్ల వెంట ఉన్న ప్రమాదకర బావులను పూడ్చివేయిస్తాం. నర్సాపూర్ చెరువు కట్టపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. – అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

కంచెలు ఏర్పాటు చేస్తాం

గ్రామాల్లో రోడ్డు పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కంచెలు ఏర్పాటు చేస్తాం. త్వరలోనే చేతికి అందకుండా పైకి ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూస్తాం. – మహేశ్, విద్యుత్ ఏఈ

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	140
వంకాయ	70
బెండకాయ	60
పచ్చిమిర్చి	180
కాకరకాయ	100
బీరకాయ	120
క్యారెట్	120
గోరుచిక్కుడు	50
కొత్తిమీర	120
అల్లం	200
ఎల్లిగడ్డ	140
ఉల్లిగడ్డ	40
ఆలుగడ్డ	40

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : మహావీరుడు
నారాయణ : బేబీ

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆసుపత్రి ఫీడర్ పరిధిలో 11 కేవిలో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆసుపత్రి, సాగర్ కాలనీ, బర్కత్‌పుర, ప్రియదర్శినినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు వ్యతిరేక పార్టీని తరిమికొడదాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


ఇటిక్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని తరిమికొడదామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేమాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ అందక పంటలు ఎండిపోతే.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, శంకర్, పలు గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలోనే రైతురాజ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దిలావర్‌పూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్లస్టర్ పరిధిలోని రైతులతో మాట్లాడారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత, మోహిద్, పుప్పాల శంకర్, వాల్‌సింగ్, గంగాధర్, రాజగంగన్న, శ్రీనివాస్, మల్లయ్య తదితరులున్నారు.

నంబర్‌ప్లేట్ విరగ్గొడితే కేసు


మాట్లాడుతున్న పట్టణ సీఐ పురుషోత్తం

నిర్మల్‌టౌన్: ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు నెంబర్‌ప్లేట్ విరగ్గొట్టినా.. తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని నిర్మల్ పట్టణ సీఐ పురుషోత్తం హెచ్చరించారు. పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 77 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పట్టణంలో మైనర్ల చేతికి వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపినా.. రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 18 మందికి రూ.500 తో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. ఇందులో పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భైంసారూరల్: నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం మండలంలోని దేగాం గ్రామంలో తన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థినులకు తక్షణమే మరుగుదొడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలకు మరమ్మతులు చేసి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించి మనఊరు–మనబడిలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజారాం, గంగరాజు, రుద్రప్రతాప్ తదితరులు ఉన్నారు.

'కేసీఆర్‌కు బుద్ధి చెప్పడం ఖాయం'

కుభీర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడించి సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని శివుని, శివునితండా, చాతా గ్రామాల్లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవన్, నందు, పాపిలి మనోజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని సర్పంచ్ హరితప్రతాప్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ రాచమల్ల భద్రయ్య అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించి నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు డీఈవో రవీందర్‌రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

బస్తీ బాట

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో సోమవారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ పట్టణ కన్వీనర్ రవీందర్, కోకన్వీనర్ సాయికుమార్, మైనార్టీ కన్వీనర్ సోఫీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండగ

కుంటాల: మండలంలోని శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు ఎత్తుకొని స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారు, పోతరాజుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బోడిగాం సంతోశ్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్, సిబ్బంది పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుగుణ, వనజ, కార్యదర్శి విక్రమ్‌రాజ్, బిల్‌కలెక్టర్ వంశీ, శారద తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన గోండుగూడ రోడ్డు


వరదకు కొట్టుకుపోయిన రోడ్డు

- వరదతో నిలిచిపోయిన రాకపోకలు
- బీటీరోడ్డు నిర్మించాలని ఆదివాసీల వేడుకోలు

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట పంచాయతీ పరిధిలోని గోండుగూడ రోడ్డు వరద ప్రవాహానికి సోమవారం కొట్టుకుపోయింది. 50 మంది ఆదివాసీలున్న ఈ గ్రామానికి చేరుకోవాలంటే రెండు వాగులు దాటాల్సిందే. గతేడాది భారీ వర్షాలకు పైపుల రోడ్డు కొట్టుకుపోవడంతో ఈ వేసవిలో దస్తురాబాద్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ మొరం, పైపులతో రోడ్డు ఏర్పాటు చేయించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద పెరిగి మళ్లీ రోడ్డు తెగిపోయింది. దీంతో ప్రస్తుతం ఆదివాసీ గూడేనికి రోడ్డు కరువైంది. ఏటా వర్షాకాలంలో అత్యవసర వేళ ఇబ్బంది పడుతున్నామని.. అధికారులు తమ గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని ఆదివాసీలు వేడుకుంటున్నారు.

ఘనంగా సోమావతీ అమావాస్య


కుంటాల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఖానాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: సోమావతీ అమావాస్య పురస్కరించుకొని సోమవారం మండలంలోని కుంటాల ఉమామహేశ్వర మహాదేవుడి ఆలయం, ఓలా శివాలయం, సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ రోజున ఉపవాసం చేసి రావిచెట్టుకు 108 ప్రదక్షిణలు చేస్తే జాతకంలో సకల దోషాలు తొలగిపోతాయని పండితులు తెలిపారు.

ఖానాపూర్: సోమావతీ అమావాస్యను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని అన్నపూర్ణ మహాదేవ ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ మాట్లాడుతూ రావి, వేప చెట్లను పూజించి అష్టోత్తర శతనామావళి, శివారాధన కార్యక్రమం చేసినట్లు పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత శని తన సొంత రాశి కుంభరాశిలోకి వచ్చే సందర్భమే ఇదని తెలిపారు. భక్తులు మౌనవ్రతం పాటిస్తూ రావి, వేప చెట్లకు 108 ప్రదక్షిణలు చేశారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

లక్ష్మణచాంద: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామపంచాయతీల కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 12 రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడం మరింత బాధిస్తుందన్నారు.

కడెం: కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. కార్మికులతో కడెం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు.

భైంసా: పంచాయతీ కార్మికులు సోమవారం బాసరలో ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్సై ఉజ్వల కార్మికులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

ఖానాపూర్: పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ముందు వంటావార్పు నిర్వహించారు. చంద్రశేఖర్, నాగరాజు, పోశెట్టి తదితరులున్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కలమడుగు-పాండ్వాపూర్ రోడ్డుపై సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ శ్రీనివాస్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మాకెందుకని అనుకోలేదు..


కళేబరం తొలగిస్తున్న ఎస్సై గౌసొద్దీన్

భైంసాటౌన్: పట్టణంలో బాసర రహదారిపై ఎస్ఎస్ కాటన్ ఎదుట రోడ్డుపై ఓ గేదె దూడ మృతి చెందింది. దుర్వాసన వస్తున్నా.. ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా ఎవరూ తొలగించడం లేదు. సోమవారం పెట్రోలింగ్‌లో భాగంగా అటు వెళ్తున్న పట్టణ ఎస్సై ఎండీ గౌసొద్దీన్, హెడ్ కానిస్టేబుల్ మస్తాన్‌రావు గమనించి కళేబరం రోడ్డు పక్కకు తొలగించారు.

గల్లాపెట్టెల పంపిణీ

కుభీర్: మండల కేంద్రంలోని పలు దుకాణాల వారికి హిందూ వాహిని కార్యకర్తలు గల్లాపెట్టెలు అందజేశారు. ఆయా దుకాణాలకు వచ్చే హిందువులు స్వచ్ఛందంగా డబ్బులు ఈ పెట్టెల్లో వేస్తారు. ఈ సొమ్మును వారానికోసారి తీసి గోశాల, సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.